
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

సోమవారం । 8 । జనవరి । 2024



సోమశిలలో 32.303 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం నాటికి 32.303 టీఎంసీలు ఉన్నాయి. పెన్నార్ డెల్టాకు 2,300, ఉత్తర,దక్షిణ కాలువలకు 450 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా) -	రూ.64,670
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా) -	రూ.5,808
3 శాతం జీఎస్టీతో..	- రూ.5,982
నవర (8 గ్రా)	- రూ.47,856

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 29.9 /24.5

ఆదివారం వాతావరణంలో తేమ 70 శాతం ఉంది. అక్కడక్కడ చిరుజల్లులు పడ్డాయి. సోమవారం కూడా ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీలు సమ్మె విరమించాలి

నెల్లూరు (వేదాయపాళెం): జాతీయ ఆహార భద్రతా చట్టం ప్రకారం గర్భిణులు, బాలింతులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం తప్పనిసరి అయినందున అంగన్‌వాడీ వర్కర్లు సమ్మె విరమించాలని ఐసీడీఎస్ పీడీ హేనసుజన్ ఆదివారం ప్రకటనలో తెలిపారు. విధుల్లో చేరాలని ఈ నెల 3,4 తేదీల్లో అంగన్‌వాడీలకు విజ్ఞప్తి చేశామని చెప్పారు. అయినప్పటికీ కొందరు సమ్మె విరమించలేదన్నారు. ఏపీ అత్యవసర సర్వీస్, మెయింటెనెన్స్ యాక్ట్ 1971 కింద అంగన్‌వాడీ వర్కర్లు ఆరు నెలలు పాటు సమ్మె చేయరాదని ఏపీ ప్రభుత్వ మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల శాఖ శనివారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. అంగన్‌వాడీలు తక్షణమే సమ్మె విరమించి విధుల్లో చేరాలని, లేకుంటే ఏపీ అత్యవసర సర్వీస్, మెయింటెనెన్స్ యాక్ట్ 1971 ప్రకారం శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

సీఐల బదిలీ

నెల్లూరు(క్రైమ్): రానున్న ఎన్నికల దృష్ట్యా గుంటూరు రేంజ్ పరిధిలోని పదహారు మంది సీఐలను బదిలీ చేస్తూ రేంజ్ ఐజీ జీ పాలరాజు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. అందులో భాగంగా నెల్లూరు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ బీవీవీ సుబ్బారావు రేంజ్ వీఆర్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో గుంటూరు జిల్లా పొన్నూరు పట్టణ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఖాజా అల్తాఫ్‌హుస్సేన్ నియమితులయ్యారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట రూరల్ సీఐగా పనిచేస్తున్న బీ అశోక్‌కుమార్‌ను చిన్నబజారు పోలీసుస్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా నియమించారు. గతంలో అశోక్ కుమార్ చిన్నబజారు ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ చిలకలూరిపేట రూరల్ సీఐగా బదిలీపై వెళ్లారు. అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగా ఉంది. దీంతో తిరిగి అశోక్‌కుమార్‌నే నియమించారు. దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్‌గా నియమితులైన ఖాజాఅల్తాఫ్ హుస్సేన్ గతంలో ఆత్మకూరు సీఐగా పనిచేశారు.

సీజ్ చేసిన వరి ధాన్యం వేలం 10న

వెంకటాచలం: వెంకటాచలం పోలీస్ స్టేషన్ పరిధిలో 2022లో సీజ్ చేసిన 23 పుట్ల వరి ధాన్యాన్ని కోర్టు ఉత్తర్వుల ప్రకారం ఈ నెల 10న వేలం వేయనున్నట్లు వెంకటాచలం సీఐ అంకమరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటాచలం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో 10న ఉదయం 10 గంటలకు వేలం ప్రక్రియ జరుగుతుందని చెప్పారు. వేలంలో పాల్గొనేందుకు ఆసక్తి కలిగిన వారు 94407 96318 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

రెవెన్యూలో మాయాజాలం

కార్పొరేషన్‌లో పన్నుల వసూళ్లలో ఆర్‌ఐల చేతివాటం

- అనధికార భవన నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ కోసం కనికట్టు
- భవనం ఉన్న చోట ఖాళీ స్థలానికి పన్ను విధింపు
- బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ద్వారా ప్లాన్ అప్రూవల్
- ఇటువంటి ఘటనలు కోకొల్లలు

కార్పొరేషన్ రెవెన్యూ విభాగంలోని కొందరు ఆర్‌ఐలు పన్నుల వసూళ్లలో చేతివాటం ప్రదర్శిస్తున్నారు. భవనం ఉన్న చోట ఖాళీ స్థలం ఉన్నట్లు..ఖాళీ స్థలం ఉన్న చోట భవనం ఉన్నట్లు కనికట్టు చేస్తూ పన్నులు తగ్గించి వసూలు చేస్తున్నారు. తమ జేబులు నింపుకొంటూ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారు.



2021లో గిరీష్‌జైన్ కొనుగోలు చేసిన మాగుంట లేఅవుట్‌లోని జీ+3 అసంపూర్తి భవనం (ఫైల్)

నెల్లూరు(బారకాసు): నెల్లూరు కార్పొరేషన్‌లోని రెవెన్యూ విభాగంలోని కొందరు ఆర్‌ఐలు పన్నుల వసూళ్ల ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. కార్పొరేషన్‌కు ఆదాయానికి తీసుకురావాల్సిన వారు తమ స్వలాభం చూసుకుంటూ ప్రాపర్టీ యజమానులకు తక్కువ మొత్తం పన్నులు విధిస్తున్నారు. తమ జేబులు నింపుకోవడమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తూ కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతున్నారు. తాజాగా ఓ ఆర్‌ఐ చేతివాటం వెలుగుచూసింది. ఖాళీ స్థలంలో భవనం ఉన్నట్టుగా పన్ను వేయడం, భవనం ఉన్న ప్రాంతం ఖాళీ స్థలంగా కనికట్టు చేసి పన్ను విధించడంలో సదరు ఆర్‌ఐ దిట్ట. తన పరిధిలోని ప్రాంతాల్లోని ప్రాపర్టీ యజమానులకు పన్నులు తగ్గించి వేసి అందుకు ప్రతిఫలంగా వారి నుంచి అధిక మొత్తంలో నగదు తీసుకోవడం ద్వారా భారీగా కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు ఆర్‌ఐ తీరుపై పలుమార్లు ఏసీబీ అధికారులకు ఫిర్యాదులు అందడంతో వారు స్పందించి విచారణ సైతం చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో అక్రమ పర్వం వెలుగులోకి వచ్చింది.



ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకున్న భవనం

అనధికార భవనానికి ప్లాన్ అప్రూవల్ కోసం..

నగరంలోని మాగుంటలేఅవుట్ ప్రధాన రహదారి పక్కన సంజయ్‌జైన్ తన ఖాళీ స్థలంలో 2013లో కార్పొరేషన్ అనుమతి(ప్లాన్) లేకుండా జీ+3 భవనాన్ని నిర్మించాడు. భవన నిర్మాణం వందశాతం పూర్తి చేయక అసంపూర్తిగానే ఉంది. సదరు భవనాన్ని 2021లో గిరీష్‌జైన్ కొనుగోలు చేశాడు. 2021 డిసెంబర్ 29న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ నంబర్ 15300/2021తో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. సాధారణంగా భవన నిర్మాణానికి ప్లాన్ అప్రూవల్ పొందాలంటే ముందుగా ఖాళీ స్థలానికి వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్ (వీఎల్‌టీ)కట్టాల్సి ఉంటుంది. అది పూర్తి స్థాయిలో కడితేనే భవన నిర్మాణానికి అనుమతి లభిస్తుంది. కానీ గిరీష్‌జైన్ భవన నిర్మాణాన్ని కొనుగోలు చేశాడు. అలాంటప్పుడు కట్టిన భవనానికి ప్లాన్ ఇచ్చే పరిస్థితి లేదు. ఒకవేళ ప్లాన్ లేకుండా కట్టిన భవనాలను క్రమ బద్ధీకరణ చేసుకోవాలంటే బీపీఎస్ స్కీం పెట్టినప్పుడు మాత్రమే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

అవినీతిలో టౌన్‌ప్లానింగ్ ఉద్యోగికి వాటా..

అనధికారికంగా నిర్మించిన జీ+3 భవనానికి కార్పొరేషన్ టౌన్‌ప్లానింగ్‌లోని ఓ ఉద్యోగి గిరీష్ జైన్ పేరు మీద 2023 మార్చి 29న ప్లాన్ ప్రొసీడింగ్ బీఏ నంబరు 1031/0380/ఎన్ఎంసీ/టీకేపీవైటీ/2023 ప్లాన్ ఇవ్వడం జరిగింది. అందుకు ఆ ప్రాంతానికి సంబంధించిన టౌన్‌ప్లానింగ్ ఉద్యోగి అయిన బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్‌కు భారీస్థాయిలో ముడుపులు ముట్టడంతోనే ఇంతటి సాహసానికి ఒడికట్టారని తెలుస్తోంది. కార్పొరేషన్ ఆదాయానికి గండి కొడుతూ తమ స్వలాభం చూసుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్న సంబంధిత ఉద్యోగులపైన ఉన్నతాధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆర్‌ఐ కనికట్టు

గిరీష్‌జైన్ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్ కోసం సదరు ప్రాంత ఆర్‌ఐను సంప్రదించగా తన మేధస్సును ఉపయోగించాడు. ఎవ్వరికీ అనుమానం రాకుండా భవనం ఉన్న ప్రాంతం ఖాళీగా ఉన్నట్టుగా చూపి 2023 ఫిబ్రవరిలో అసెస్‌మెంట్ నంబరు 1031139546తో వీఎల్‌టీ ట్యాక్స్ రూ.17,918 చొప్పున వేశాడు. అలా ఆరు వాయిదాల మొత్తం రూ.1,07,508 సంజయ్‌జైన్ చెల్లించినట్లుగా నమోదు చేశాడు. ఆ తరువాత మార్చిలో జీ+3 భవనం కట్టినట్టుగా ఒక వాయిదాకి రూ.41,658 చొప్పున పన్ను విధించాడు. గిరీష్‌జైన్ పేరు మీద 2023 మార్చి 29న ప్లాన్ ప్రొసీడింగ్ బీఏ నంబరు 1031/0380/ఎన్ఎంసీ/టీకేపీవైటీ/2023తో ప్లాన్ తీసుకున్నారు. అదే నెలలో భవనాన్ని విక్రయించిన సంజయ్‌జైన్ పేరు మీద అనధికారికంగా నిర్మించిన భవనానికి పన్ను విధించారు. ఆ తరువాత టైటిల్ ట్రాన్స్‌ఫర్ 2023 మే 12న గిరీష్‌జైన్ పేరు మీద చేయడం జరిగింది. ఒక వ్యక్తి నుంచి మరొక వ్యక్తి స్థలం లేదా భవనాన్ని కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న తర్వాత ఆ ప్రాపర్టీపైన సర్వహక్కులు కొనుగోలు చేసిన వ్యక్తికే ఉంటాయి. మరి అటువంటిది సంజయ్‌జైన్ 2021లో గిరీష్‌జైన్‌కు భవనాన్ని విక్రయించగా ఆయన పేరు మీద కాకుండా సంజయ్‌జైన్ పేరు మీదే ఖాళీ స్థలం ఉన్నట్టుగా 2023లో పన్ను(వీఎల్‌టీ) విధించడం, ఆ తరువాత రెండు నెలల్లోనే భవన నిర్మాణానికి పన్ను విధించడం జరిగింది. అంటే రెండు నెలల్లోనే జీ+3 భవన నిర్మాణం ఎలా సాధ్యమైందనేది ప్రశ్నార్థకం. 2021లో అనధికారికంగా నిర్మించిన భవనాన్ని కొనుగోలు చేస్తే ఆ భవనానికి 2023లో ప్లాన్ ఇవ్వడం, పన్ను వేయడం వంటి చర్యలు చేపట్టడం చూస్తుంటే సంబంధిత ఉద్యోగులు వారి స్వలాభం కోసం ఏమైనా చేస్తారనేందుకు ఇదొక ఉదాహరణ. ఇలాంటి మాయాజాలాలు నగరంలో ఎన్ని భవనాలకు చేశారనేది పరిశీలిస్తే మరిన్ని వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ విషయమై కమిషనర్ వికాస్‌మర్మత్‌ను సంప్రదించగా భవనాన్ని పరిశీలించి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

10 వరకు ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లింపునకు అవకాశం

నెల్లూరు (టౌన్): ఈ ఏడాది ఇంటర్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు రూ.2,500 అపరాధ రుసుంతో పరీక్ష ఫీజు చెల్లింపునకు ఈ నెల 10వ తేదీ వరకు అవకాశం కల్పించినట్లు ఆర్‌ఐఓ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ నెల 19న విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేపడుతున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఈ నెల 8 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనాలని కోరారు. 8న జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించాలన్నారు. అంబేడ్కర్- సామాజిక న్యాయం అన్న అంశంపై చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్, తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేయాలన్నారు. ఇంటర్ డూప్లికేట్ పాస్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో ఉంచినట్లు చెప్పారు. ఈ నెల 10 నుంచి apbie.apcfss.in వెబ్‌సైట్‌లో విద్యార్థులు స్వీయ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేసి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ, భారత క్రీడా ప్రభుత్వం ఆధ్వర్యంలో సామాజిక సమీకరణ, విద్యా సమానత, ఆచరణీయ నైపుణ్యాల అభివృద్ధి లక్ష్యంతో రూపొందించిన mybharath.gov.in వెబ్‌సైట్‌లో 15 ఏళ్లు నిండిన విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకునేలా కళాశాల ప్రిన్సిపాళ్లు కృషి చేయాలన్నారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు





జిల్లాలో తెలుగు వారి పెద్ద పండగ సంక్రాంతి సంబరాలు మొదలయ్యాయి. ఆదివారం ఆత్మకూరులో తెలుగు భారతి సేవా సమితి, శ్రీసాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ముందస్తు సంబరాల్లో హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు అలరించాయి. కర్ర సాము, కుస్తీ, కోలాటం, పందరి భజన, రంగవల్లుల పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. – ఆత్మకూరు

జగన్‌తోనే సామాజిక న్యాయం



మాట్లాడుతున్న మంత్రి కాకాణి, పక్కన ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే మానుగుంట, జెడ్పీ చైర్‌పర్సన్ అరుణమ్మ

- నేటి నుంచి అంబేడ్కర్‌ను స్మరించుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు
- ఈ నెల 19 న అంబేడ్కర్ విగ్రహావిష్కరణను విజయవంతం చేద్దాం
- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ వేమిరెడ్డి

సాక్షి ప్రతినిధి, నెల్లూరు : రాష్ట్రంలో సామాజిక న్యాయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నెల 19న విజయవాడలో 125 అడుగుల ఎత్తైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేపడుతున్న సందర్భంగా జిల్లాలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై సన్నాహక సమావేశాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. మాగుంటలేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రి కాకాణి పాల్గొన్నారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి ప్రజాప్రతినిధులతో కలిసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ సామాజిక న్యాయానికి గుర్తుగా విజయవాడలోని స్వరాజ్ మైదానంలో 125 అడుగుల ఎత్తు గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహం, మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమైందన్నారు. సామాజిక న్యాయం విషయంలో ఆయన దేశానికే ఆదర్శంగా నిలిచారని కొనియాడారు.

నేటి నుంచి ప్రత్యేక కార్యక్రమాలు

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ ఉత్సవాల్లో భాగంగా సోమవారం నుంచి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మంత్రి కాకాణి తెలిపారు. రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తిని స్మరించుకుంటూ గ్రామగ్రామాన ఆయన సేవలను గుర్తుచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రభుత్వాన్ని భాగస్వామ్యం చేయాలనే ఉద్దేశంతో ఉన్నతాధికారులు కూడా అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళులర్పించేలా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 12 వరకు గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఐదుగురు చొప్పున ఎంపిక చేసి విజయవాడలో జరిగే ప్రారంభోత్సవానికి పంపనున్నట్లు వివరించారు. 19న విజయవాడలో జరిగే అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని జిల్లాలో వీక్షించే విధంగా ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు తెలిపారు.

చంద్రబాబువి డాబు మాటలు

గతంలో చంద్రబాబు అధికారంలో ఉన్న సమయంలో విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని డాబు మాటలు చెప్పారని, ఈ విషయంపై అసెంబ్లీలో గంటసేపు ఊకదంపుడు ఉపన్యాసం చేశారని మంత్రి కాకాణి గుర్తుచేశారు. దళితులంటే చంద్రబాబుకు చిన్నచూపన్నారు. దళితులను గతంలో అనేక మాటలు చంద్రబాబు అన్నారని గుర్తుచేశారు. కానీ వైఎస్ జగన్ చెప్పిన మాట ప్రకారం సామాజిక న్యాయం చేస్తూ విజయవాడకే తలమానికంగా నిలిచేలా 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, డిప్యూటీ మేయర్ పీ రూప్‌కుమార్, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్నా
– రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నెల్లూరు లోక్‌సభ స్థానం నుంచి తాను పోటీ చేస్తున్నానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు వేమిరెడ్డి సమాధానం ఇచ్చారు. తనపై కొందరు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని చూస్తే తనకే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. అందుకే తాను కొన్ని మీడియాల్లో, సోషల్ మీడియాల్లో వచ్చే అసత్య కథనాలను పట్టించుకోనన్నారు. ఎటువంటి అపోహలు వద్దని, తాను వైఎస్సార్‌సీపీ తరఫున నెల్లూరు లోకసభ స్థానానికి పోటీ చేస్తున్నానని స్పష్టం చేశారు.

నేడు యథావిధిగా జగనన్నకు చెబుదాం

నెల్లూరు(దర్గామిట్ట): కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం యథావిధిగా జరుగుతుంది. జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్, జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. కలెక్టర్ ఎం హరినారాయణన్ భారత ఎన్నికల కమిషన్ కమిషనర్ విజయవాడలో కలెక్టర్లతో నిర్వహిస్తున్న సమావేశానికి హాజరవుతున్నందున జాయింట్ కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు.

క్లుప్తంగా

భారీ జెండా ఏర్పాటుకు భూమి పూజ



భూమి పూజా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఆత్మకూరు: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీన జరిగే సామాజిక సాధికార బస్సు యాత్ర సందర్భంగా మున్సిపల్ పరిధిలోని ఆంజనేయ స్వామి ఆలయం ఎదుట నెల్లూరు – ముంబై జాతీయ రహదారి సమీపంలో వైఎస్సార్‌సీపీ భారీ జెండా ఆవిష్కరణకు ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఎమ్మెల్యే సూచనలతో పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్లు డాక్టర్ కేవీ శ్రావణ్‌కుమార్, షేక్ సర్దార్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వంద అడుగుల పార్టీ జెండా ఆవిష్కరణ కోసం ధ్వజం ఏర్పాటుకు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. బస్సు యాత్ర కార్యక్రమం నాటికి పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. అలాగే యాత్ర దిగ్విజయంగా జరిగేలా ఆంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, డాక్టర్ ప్రణీత్ చౌదరి, కౌన్సిలర్లు శివకోటారెడ్డి, కామాక్షయ్య నాయుడు, గంధళ్ల వేణు, నాయకులు ఆంద్రా సుబ్బారెడ్డి, ముజీబుల్లా, తోకల వెంకటేశ్వర్లు, చిన్నపరెడ్డి, జయపాల్ రెడ్డి, నరేంద్ర రెడ్డి, ఇరగన వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి

బిట్రగుంట: బోగోలు మండలంలోని విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై నెల్లూరుకు చెందిన కౌలు రైతు వనపర్తి కృష్ణమోహన్ (54) మృతిచెందిన ఘటన ఆదివారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నగరంలోని బాలాజీనగర్‌కు చెందిన కృష్ణమోహన్ నాలుగేళ్ల నుంచి విశ్వనాథరావుపేట పంచాయతీ కొత్తూరులో 20 ఎకరాల వ్యవసాయ భూమి కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. స్థానికంగా అద్దె ఇంట్లో ఉంటూ వ్యవసాయం చేసుకుంటూ రెండు, మూడురోజులకు ఒకసారి నెల్లూరులోని కుటుంబసభ్యుల వద్దకు వెళ్లి వస్తుంటాడు. ఈ క్రమంలో నెల్లూరు నుంచి ఆదివారం ఉదయం కొత్తూరుకు వచ్చిన కృష్ణమోహన్ పొలంలోని విద్యుత్ స్తంభం వద్ద పనిచేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు కుటుంబసభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి భార్య వనపర్తి అనూరాధ ఫిర్యాదు మేరకు బిట్రగుంట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



చిల్లకూరు: మండలంలోని తీర ప్రాంతమైన తూర్పుకనుపూరులో వెలిసిన ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు, అలంకరణలు చేసి దర్శనం కల్పించారు. భక్తులు పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ కమిటీ చైర్‌పర్సన్ సిద్దారెడ్డి ఇంద్రసేనమ్మ, కమిటీ సభ్యులు దువ్వూరు చంద్రశేఖరరెడ్డి, ఈఓ నవీన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి :	రూ.30
సన్నవి :	రూ.22
పండ్లు :	రూ.7



మోసం చేయడం చంద్రబాబు నైజం



కొత్త పింఛన్ అందజేస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- ప్రతి గడప ముంగిటకే సంక్షేమ పథకాలు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

మనుబోలు: 'ప్రజలను మోసం చేయడం చంద్రబాబు నైజం. 2014 ఎన్నికల సమయంలో అనేక హామీలిచ్చాడు. గెలిచిన తర్వాత నెరవేర్చాడో? లేదో? ప్రజలంతా గుర్తు చేసుకోవాలి' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని వీరంపల్లి గ్రామంలో ఆదివారం లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. రూ.2.46 కోట్లతో నిర్మించిన సైడ్ డ్రెయిన్లు, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా వలంటీర్ల వ్యవస్థను ఏర్పాటు చేసి ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలను అందిస్తున్న ఘనత మన ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ను పెంచి రూ.3 వేలు అందజేస్తున్నారన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా సంక్షేమం విషయంలో మన రాష్ట్రానికి దరిదాపుల్లో లేవన్నారు. అర్హులైన వారిని ఎప్పటికప్పుడు గుర్తిస్తూ ఏడాదికి రెండు సార్లు కొత్త పింఛన్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. జిల్లాలో 3,19,952 మంది లబ్ధిదారులకు రూ.95.54 కోట్లను పెన్షన్ల రూపంలో చెల్లిస్తున్నట్లు తెలిపారు. పథకాల ద్వారా ప్రజలు ఆత్మగౌరవంతో బతికేలా సీఎం చర్యలు తీసుకున్నారన్నారు. ఒక్క వీరంపల్లి పంచాయతీలోనే ఇప్పటి వరకూ రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం బటన్ నొక్కుతున్నారని, త్వరలో జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ప్రజలు బటన్ నొక్కి రుణం తీర్చుకోవాలని కోరారు.

ప్రతిపక్షాలతో జాగ్రత్త

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్షాలు మభ్యపెట్టాలని చూస్తాయని, ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కాకాణి అన్నారు. సోమిరెడ్డి ఈ ప్రాంతంలో పర్యటించి ఇదంతా తాను చేసిన అభివృద్ధే అంటున్నాడని, ఆయన నిజంగా చేసి ఉంటే ఎక్కడ చేశాడో, ఎన్ని నిధులు కేటాయించాడో నిరూపించాలని సవాల్ విసిరారు. ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచిన చంద్రబాబుకు ప్రజలను మోసం చేయడం వెన్నతో పెట్టిన విద్య అన్నారు. హామీలను నెరవేర్చిన వ్యక్తి వైఎస్సార్ తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, ఎంపీపీ వజ్రమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు సురేంద్ర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, హరగోపాల్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, ఆదినారాయణ, సుధీర్‌రెడ్డి, ధనంజయరెడ్డి, మధురెడ్డి, రవీందర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మస్తాన్‌రావు, ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు

కావలి: 'మహాత్మా గాంధీ, బీఆర్ అంబేడ్కర్, జ్యోతిరావు పూలే కలలుగన్న సమాజాన్ని సాకారం చేసిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి. ఆయన తన పాలనలో వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం కల్పించారు' అని రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు అన్నారు. కావలి మండలం చెన్నాయపాళెం గ్రామంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం జరిగింది. ఇందులో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డితో కలిసి మస్తాన్‌రావు పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీద మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా సీఎం వైఎస్ జగన్ పాలనలో సామాజిక సాధికార విప్లవం సాధ్యమైందన్నారు. చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అవమానించి హక్కులను కాలరాశారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. అధికారం పెద్దలది కాదని, పేదలదని జగన్ నిరూపించారన్నారు. ఆయన పాలనలో పాలకులు ప్రజలకు సేవకులు మాత్రమేనని వివరించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట వేసినట్లు చెప్పారు. మాట తప్పని, మడమ తిప్పని జగన్‌మోహన్‌రెడ్డి లాంటి నాయకుడు చాలా అరుదన్నారు. ఆయన్ను నమ్ముకున్న వారికి ఇప్పటి వరకూ ఎంతో మంచి జరిగిందన్నారు. మళ్లీ ముఖ్యమంత్రి చేస్తే ఆయా వర్గాలకు మరింత మంచి జరిగి తీరుతుందని తెలిపారు. ఇంటి గడప దగ్గరకే పథకాలు అందిస్తున్న జగనన్నకు అందరం మద్దతిచ్చి అండగా ఉండి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్ బాబు, ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబంలో సంక్షేమ వెలుగులు



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త రాజగోపాల్‌రెడ్డి

కొండాపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపాయని వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. కొండాపురం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆదివారం పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలను ప్రజలకు అందిస్తున్నామన్నారు. గతంలోలా నాయకుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నేడు లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. అందరికీ మంచి చేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి దీవించాలని కోరారు. కొండాపురం మండలంలో నూతనంగా 136 పింఛన్లు కొత్తగా మంజూరైనట్లు తెలిపారు. 1,344 మంది రైతులకు 2,830 ఎకరాల అసైన్‌మెంట్ పట్టాలను అందించామన్నారు. ఇంకా వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రవీంద్ర, ఎంపీపీ బొడ్డు అనూరాధ ప్రసంగించారు. కార్యక్రమంలో గుడవళ్లూరు సొసైటీ అధ్యక్షుడు కర్తం శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ మన్నం వెంకటసుబ్బయ్య, జేసీఎస్ కన్వీనర్ యారం నరసింహారావు, గుడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు చిమ్మిలి రాజేంద్రప్రసాద్, నాయకులు ఎడ్లపల్లి వెంకటరమణయ్య, బొడ్డు మాధవరెడ్డి, వీరెళ్ల చంద్రయ్య, విడవలపాటి మాల్యాద్రి, 11 మంది ఎంపీటీసీలు, 19 మంది సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి స్పెల్‌బీ సెమీస్‌కు విశేష స్పందన



సాక్షి స్పెల్‌బీ సెమీ ఫైనల్ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

- మూడు ఉమ్మడి జిల్లాల నుంచి హాజరైన విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు ఇంగ్లిష్ భాషపై పట్టు సాధించేలా, వారి ప్రతిభకు పదును పెట్టేందుకు సాక్షి స్పెల్‌బీ దోహదం చేస్తోంది. ఉన్నత విద్య అభ్యసించాలన్నా, ఉన్నత కొలువును సాధించాలన్నా ఇంగ్లిష్‌పై పట్టు తప్పనిసరి. అందులో నైపుణ్యం, సామర్థ్యం ఉంటేనే నేటితరం ఉన్నతంగా రాణిస్తుంది. ఇంగ్లిష్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించి, వారిలో నైపుణ్యం, ఆసక్తిని పెంపొందించేందుకు ఏటా సాక్షి మీడియా గ్రూప్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా స్పెల్‌బీ పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రాథమిక, క్వార్టర్, సెమీఫైనల్, ఫైనల్ నాలుగు దశల్లో స్పెల్‌బీ నిర్వహించి.. ఫైనల్‌లో సత్తా చాటిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహక బహుమతులను అందిస్తోంది. ఈ పరీక్షకు ప్రధాన స్పాన్సర్‌గా డ్యూక్స్ వ్యాఫీ, అసోసియేషన్ స్పాన్సర్‌గా రాజమండ్రికి చెందిన ట్రిప్స్ ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవహరిస్తున్నాయి. సాక్షి నిర్వహిస్తున్న స్పెల్‌బీ పరీక్షలకు పాఠశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రత్యేక ఆసక్తి చూపుతున్నారు. ఎప్పటిలానే ఈ ఏడాది సైతం విద్యార్థులు ఈ పరీక్షకు అధిక సంఖ్యలో హాజరై తమ ప్రతిభను చాటుకున్నారు. ఆదివారం తిరుచానూరు రోడ్డు, శ్రీనివాసపురంలోని హోలీ గ్రీన్ పాఠశాలలో స్పెల్‌బీ సెమీఫైనల్స్ నిర్వహించారు. ఇది వరకు పాఠశాల స్థాయి, జిల్లాస్థాయి (క్వార్టర్ ఫైనల్స్)లో జరిగిన ఈ పరీక్షల్లో విజేతలకు సెమీఫైనల్స్ (మూడో రౌండ్) పరీక్షను నాలుగు కేటగిరీల్లో నిర్వహించారు. దీనికి ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, నెల్లూరు జిల్లాల నుంచి విద్యార్థులు, ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు.

నైపుణ్యం పెరిగింది



ఇంగ్లిష్‌పై ఆసక్తి పెరగడానికి స్పెల్‌బీ దోహదపడింది. అనేక కొత్త పదాలు తెలుసుకున్నా. ఈ స్పెల్‌బీ పరీక్ష ద్వారా ఇంగ్లిష్ భాషపై పట్టు, నైపుణ్యం పెరిగింది. సరళంగా, తప్పులు లేకుండా మాట్లేడేందుకు స్పెల్‌బీ ఉపయోగపడింది.

– ఎస్.విశాల్‌కుమార్‌రెడ్డి, 7వ తరగతి, రెయిన్‌బో స్కూల్, నెల్లూరు

గాయపడిన వృద్ధురాలు మృత్యువాత

కోట: కోట బజారువీధిలోని దాదరాయిగుంట సమీపంలో శనివారం రాత్రి గాయపడిన గుర్తుతెలియని వృద్ధురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. ఆమె గాయపడి రోడ్డు పక్కన పడి ఉండటాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. 108 అంబులెన్స్‌లో కోట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గూడూరు ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ఆమె మృతి చెందారు. వివరాలు తెలియలేదని, సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) :	90
లేయర్ (లైవ్) :	85
బ్రాయిలర్ చికెన్ :	170
బ్రాయిలర్ స్కిన్‌లెస్ :	190
లేయర్ చికెన్ :	145



బంగారు వ్యాపారులపై దాడి

- రూ.కోటి సొత్తు దోపిడీ
- విభిన్న కోణాల్లో పోలీసుల దర్యాప్తు

నెల్లూరు(క్రైమ్): బంగారు వ్యాపారులపై గుర్తుతెలియని దుండగులు దాడికి పాల్పడ్డారు. వారి వద్దనున్న రూ.కోటి విలువచేసే 1,758 కేజీల బంగారు ఆభరణాలు, రూ.10 లక్షల నగదు దోచుకెళ్లారు. ఈ ఘటన నెల్లూరు నగరంలో శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ కేసును ఛేదించేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు రంగంలోకి దిగి విభిన్న కోణాల్లో దర్యాప్తు చేస్తున్నాయి. బాలాజీ నగర్ ఇన్‌స్పెక్టర్ వీరానాయక్ ఆదివారం వివరాలు వెల్లడించారు. రామ్మూర్తినగర్ మూడోవీధిలోని ఓ అపార్ట్‌మెంట్లో చంద్రశేఖర్‌రావు, హరికోటేశ్వరరావు అనే అన్నదమ్ములు నివాసం ఉంటున్నారు. వీరు కొన్నేళ్లుగా మండపాలవీధిలో జ్యువెలరీ షాపు నిర్వహిస్తున్నారు. బంగారు ఆభరణాలు విక్రయించడంతో పాటు ఆర్డర్లపై ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు దుకాణాలకు ఆభరణాలు సరఫరా చేస్తున్నారు. మండపాలవీధికి చెందిన బంగారు వ్యాపారి రామాచారి వారికి స్నేహితుడు. ఈనెల 6వ తేదీన హరికోటేశ్వరరావు తన వద్ద, స్నేహితుడి వద్దనున్న సుమారు 2 కేజీల బంగారు ఆభరణాలను తీసుకుని విక్రయించేందుకు గూడూరుకు వెళ్లాడు. అక్కడ ఐదు దుకాణాల్లో ఆభరణాలను విక్రయించాడు. కొందరు వ్యాపారులు బకాయి తాలూకా రూ.10 లక్షల నగదు ఇచ్చారు. తన వద్దనున్న మిగిలిన 1,758 గ్రాముల బంగారు ఆభరణాలు, నగదును ఆయన బ్యాగ్‌లో పెట్టుకుని ఆర్టీసీ బస్సులో నెల్లూరుకు బయలుదేరాడు. నెల్లూరు సమీపిస్తుండగా ఆర్టీసీ బస్టాండ్ వద్దకు రావాలని అన్న చంద్రశేఖర్‌రావుకు ఫోన్ చేసి చెప్పాడు. బస్సు నెల్లూరు ప్రధాన బస్టాండ్ వద్దకు చేరుకునే సరికే చంద్రశేఖర్‌రావు బైక్‌తో సిద్ధంగా ఉన్నాడు. అన్నదమ్ములిద్దరూ ఇంటికి బయలుదేరారు.

ముగ్గురు వ్యక్తులు వచ్చి..

అన్నదమ్ములిద్దరూ న్యూ జ్యోయాలుక్కాస్ జ్యువెలరీ షాపు సమీపంలోకి వచ్చేసరికి ముఖానికి మాస్క్‌లు ధరించిన ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి వారిని అడ్డుకున్నారు. ఓ వ్యక్తి కిందకు దిగి బంగారు వ్యాపారులపై దాడి చేసి నగల బ్యాగ్‌ను లాక్కుని బైక్ ఎక్కి పరారయ్యారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న బాధితులు తేరుకునేలోపే దుండగులు వెళ్లిపోయారు. ఈ మేరకు బాధితుడు హరికోటేశ్వరరావు బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దోపిడీకి గురైన సొత్తు విలువ రూ.కోటికి పైగా ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇన్‌స్పెక్టర్ వీరా నాయక్ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం ఆరా తీశారు.

విభిన్న కోణాల్లో కేసు దర్యాప్తు

ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన ఇన్‌స్పెక్టర్ విభిన్న కోణాల్లో కేసు దర్యాప్తు చేపట్టారు. దోపిడీ జరిగిన తీరు పలు అనుమానాలకు తావిస్తోంది. బాధితులు అంతపెద్ద మొత్తంలో బంగారం, నగదుతో వస్తున్నారని పక్కా సమాచారంతో దోపిడీకి పాల్పడటాన్ని బట్టి చూస్తే తెలిసిన వారు చేసి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. దీంతో ఆ కోణంలోనూ విచారణ చేస్తున్నారు. బాధితుడు గూడూరు నుంచి బయలుదేరినప్పటి నుంచి దోపిడీ జరిగిన స్థలం వరకు ఉన్న సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. దోపిడీ అనంతరం నిందితులు ఆత్మకూరు బస్టాండ్ వైపు వెళ్లడంతో ఆ వైపు నున్న ఫుటేజీలను సైతం పరిశీలిస్తున్నారు. గత ఏడాది చివరలో నగరంలోని దేవిరెడ్డివారి వీధిలో బంగారు వ్యాపారి దంపతులపై దాడి చేసి పెద్దఎత్తున బంగారు, నగదు దోచుకెళ్లిన ఘటన మరువక ముందే మరో ఘటన చోటు చేసుకోవడంతో వ్యాపారులు బెంబేలెత్తుతున్నారు. తాజా ఘటనను త్వరలోనే ఛేదిస్తామని పోలీసు అధికారులు వెల్లడించారు. వ్యాపారులు దుకాణాల్లో విధిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని, పెద్ద మొత్తంలో బంగారు ఆభరణాలు, నగదు తీసుకెళ్లే క్రమంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచిస్తున్నారు.